క్లుప్తంగా

అంధకారంలో వాకింగ్ పార్కు



గుల్లలపాలెం వాకింగ్ పార్కులో చీకటి

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెంలోని వాకింగ్ పార్కులో అంధకారం నెలకొంది. పార్కులోని విద్యుత్ ఎల్ఈడీ లైట్లు వెలగడం లేదు. దీంతో ఇక్కడికి సాయంత్రం పూట వాకింగ్‌కు వచ్చే వారు చీకట్లో ఇబ్బంది పడుతున్నారు. పారిశ్రామిక ప్రాంతంలోని పలు వార్డుల ప్రజల సౌకర్యార్థం గుల్లలపాలెంలో వాకింగ్, సైకిలింగ్ పార్కును జీవీఎంసీ అధికారులు ఏర్పాటు చేశారు. ఇక్కడ ఉదయం, సాయంత్రం పూట పలువురు వాకింగ్‌కు వస్తుంటారు. సాయంత్రం వేళలో వాకింగ్‌కు వచ్చే వారి కోసం పార్కులో నలుమూలలా ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం అవి వెలగకపోవడంతో వాకర్లు ఇబ్బందికి గురయ్యారు. ఈ సమస్యను అధికారులు పరిశీలించి పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

ఎమ్మెల్యే దృష్టికి గెడ్డ సమస్య



ఎమ్మెల్యే గణబాబుకు గెడ్డ సమస్యను వివరిస్తున్న స్థానికులు

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు గుల్లలపాలెంలోని గెడ్డను ఆధునికీకరించాలని స్థానిక వాసులు ఎమ్మెల్యే పి.గణబాబుకు వివరించారు. వార్డులో బుధవారం పర్యటించిన ఎమ్మెల్యేకు గుల్లలపాలెం ప్రాంత వాసులు గెడ్డను సమస్యను వివరించారు. దీంతో ఆయన గెడ్డ వద్దకు పరిశీలించారు.గెడ్డ ఆక్రమణకు గురికావడం, రక్షణ గోడ శిథిలావస్థకు చేరిందని గుర్తించారు. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వార్డు టీడీపీ అధ్యక్షుడు కోరాడ శ్రీను పాల్గొన్నారు.

10 కిలోల గంజాయి స్వాధీనం

● పోలీసుల అదుపులో ముగ్గురు వ్యక్తులు

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ముగ్గురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. వారు తెలిపిన వివరాలిలా.. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వే స్టేషన్ రిజర్వేషన్ కౌంటర్ వద్ద గంజాయి రవాణా జరుగుతోందనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు అనుమానాస్పద వ్యక్తుల వద్ద సోదాలు చేశారు. ముగ్గురు వ్యక్తుల నుంచి 10 కిలోల గంజాయితోపాటు రూ.1,500 స్వాధీనం చేసుకుని ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథరావు మాట్లాడుతూ నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ ఆదేశాల మేరకు స్పెషల్ బ్రాంచ్ అడిషనల్ కమిషనర్ గంగాధర్ పర్యవేక్షణలో సోదాలు చేశామన్నారు. కేరళ తిరువనంతపూర్‌కు చెందిన సురేష్‌కుమార్, అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట బొడ్డపుట్టుకు చెందిన మజ్జి బాలకృష్ణ, మజ్జి అరుణలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

హెచ్‌పీసీఎల్‌లో ఏయూ విద్యార్థుల ఇంటర్న్‌షిప్ పూర్తి



విద్యార్థులను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: హెచ్‌పీసీఎల్‌లో ఏయూ వృక్షశాస్త్ర విభాగం విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌ను పూర్తి చేశారు. ఏయూతో గతంలో హెచ్‌పీసీఎల్ చేసుకున్న అవగాహన ఒప్పందంలో భాగంగా హెచ్‌పీ హరిత ప్రాజెక్టును ప్రారంభించారు. దీనిలో ఏయూ వృక్షశాస్త్ర విభాగానికి చెందిన విద్యార్థులు వృక్ష సంబంధ అధ్యయనం చేశారు. హెచ్‌పీసీఎల్‌కు చెందిన వాల్తేర్ పార్క్, యారాడ హౌసింగ్ కాలనీలో ఉన్న వృక్ష సముదాయం, అరుదైన మొక్కలపై పీజీ విద్యార్థులు పరిశోధన జరిపారు. విజయవంతంగా ఇంటర్న్‌షిప్‌ను పూర్తిచేసిన విద్యార్థులకు హెచ్‌పీసీఎల్ సంస్థ సర్టిఫికెట్లను ప్రదానం చేసింది. విద్యార్థులను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి బుధవారం అభినందించారు.

ఆక్రమణలు తొలగిస్తూ.. అవగాహన కల్పిస్తూ..

ట్రాఫిక్ సమస్యలు, ప్రమాదాలకు చెక్ పెట్టేలా కంచరపాలెం ట్రాఫిక్ పోలీసుల చర్యలు



బీఆర్‌టీఎస్ రోడ్డులో ఫుట్‌పాత్ ఆక్రమణను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు



రోడ్డు ప్రమాదాలపై దృశ్య వాహనం ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ పాపారావు

మర్రిపాలెం: వాహన చోదకుల సురక్షిత ప్రయాణానికి ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఇటీవల కాలంలో ట్రాఫిక్ సమస్యలు ఎక్కువైపోయాయి. కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో తాటిచెట్లపాలెం నుంచి ఎన్ఏడీ వరకు గల బీఆర్‌టీఎస్ రోడ్డులో దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. వాహనాల పార్కింగ్‌కు నిర్ణీత స్థలం లేక.. ఒక వేళ ఉన్నా తోపుడు బళ్లు, పాన్‌షాపులు తదితర చిరు వ్యాపారులు వాటిని ఆక్రమించి వ్యాపారాలు సాగిస్తున్న తరుణంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఫుట్‌పాత్ ఆక్రమణలు, రాంగ్ పార్కింగ్, తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు వంటి విషయాలపై ట్రాఫిక్ పోలీసులు సుమారు వారానికి రెండు, మూడు సార్లు దృష్టి సారించి తగు చర్యలు చేపట్టి జరిమానాలు విధిస్తున్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై స్పెషల్ డ్రైవ్‌లు

కంచరపాలెం ఐదో పట్టణ ట్రాఫిక్ పోలీసులు రోడ్డు భద్రతా నిబంధనలపై స్పెషల్ డ్రైవ్‌లను ఎప్పటికప్పుడు నిర్వహిస్తున్నారు. వాటిలో ముఖ్యంగా జాతీయ రహదారి తాటిచెట్లపాలెం నుంచి ఎన్ఏడీ వరకు.. అటు బీఆర్‌టీఎస్ మార్గంలో కంచరపాలెం మెట్టు నుంచి ఎన్ఏడీ వరకు రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్డులో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న దుకాణాలు, షాపులు, రాంగ్ పార్కింగ్ వాహనాలను తొలగిస్తూనే ఉన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించకుండా సహకరించాలని కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

అన్ని కూడళ్లలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచి అతివేగంగా వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకుని జరిమానాలు వేస్తున్నారు. అతి వేగం వల్ల కలిగే నష్టాలను వాహన చోదకులకు కౌన్సెలింగ్ పెట్టి వివరిస్తున్నారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై ఉక్కుపాదం మోపుతున్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపకూడదని, ఆ సమయంలో ఎక్కడికైనా వెళ్లాల్సి వస్తే డ్రైవరును పెట్టుకుని ప్రయాణించాలని అనేక సార్లు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. అతివేగం వల్ల వాహనం నడిపే వారితో పాటు రోడ్డున ప్రయాణించేవారు వారి తప్పు లేకుండా ప్రాణాలు కోల్పోయిన పరిస్థితులు గతంలో చాలా జరిగాయి. ఈ సంఘటనలకు సంబంధించి దృశ్య వాహనాల ద్వారా పలు కాలేజీల దగ్గర, ముఖ్యమైన కూడళ్లలో ప్రదర్శించి వాటిని యువతకు చూపించి జాగ్రత్తలు సూచిస్తున్నారు. హెల్మెట్ ధరించని వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. ట్రాఫిక్ రూల్స్‌కు సంబంధించి ఎక్కడికక్కడ బోర్డులను ఏర్పాటు చేశారు. వాటిపై మార్గాలు చూపించడమే కాకుండా నిబంధనలు ఉల్లంఘిస్తే దేనికి ఎంత జరిమానా విధిస్తారో అందులో పొందుపరిచారు. తద్వారా వాహన చోదకుల్లో చైతన్యం పెంపొందేలా ట్రాఫిక్ పోలీసులు అవగాహన కల్పిస్తున్నారు.

వాహన చోదకుల భద్రతే ముఖ్యం



రోడ్డు ప్రమాదాల నియంత్రణకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. ప్రధానంగా బీఆర్‌టీఎస్ రోడ్డులో వాహనాల రాంగ్ పార్కింగ్, చిరు వ్యాపారాలు చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టి కొంతమేర నివారించాం. ఫుట్‌పాత్ ఆక్రమణలు చాలా వరకు తగ్గాయి. కంచరపాలెం ప్రధాన కూడళ్లలో ప్లకార్డులతో హెల్మెట్ ధరించమని అవగాహన కల్పిస్తున్నాం. నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధిస్తున్నాం. వాహన చోదకుల్లో చైతన్యం నింపడం కోసం ప్రత్యేక డ్రైవ్‌లు చేపడుతున్నాం.

– మళ్ల అప్పారావు, ట్రాఫిక్ సీఐ, కంచరపాలెం

ప్రాణ రక్షణకు హెల్మెట్



హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తున్న గోపాలపట్నం ఎస్ఐ శ్రీనివాసరావు

గోపాలపట్నం: ప్రయాణ సమయంలో ప్రాణాలను రక్షించే హెల్మెట్ ధరించడాన్ని నిర్లక్ష్యం చేయవద్దని ద్విచక్ర వాహన చోదకులకు గోపాలపట్నం ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. గోపాలపట్నం శ్మశాన వాటిక జంక్షన్ వద్ద బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది 147 మంది హెల్మెట్ వాడక పోవడం వల్ల ప్రమాదాలకు గురయ్యారంటూ ప్లకార్డులు చూపించి వివరించారు. ఈ విధమైన డ్రైవ్ గోపాలపట్నం స్టేషన్ పరిధిలో పలు చోట్ల నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

వ్యర్థాలకు నిప్పు

● పొగతో ఇబ్బంది పడుతున్న స్థానికులు



మొబైల్ టాయిలెట్స్ వెనుక వైపు వ్యాపిస్తున్న నల్లటి పొగ

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం వాకింగ్ పార్కును ఆనుకొని ఉన్న మొబైల్ టాయిలెట్స్ వెనుక గల ఖాళీ స్థలంలో గుర్తు తెలియని వ్యక్తులు ప్లాస్టిక్ వ్యర్థాలు, పనికి రాని కేబుల్ వైర్లు, ఇతర చెత్తను నిర్లక్ష్యంగా డంప్‌చేస్తున్నారు. అంతేకాకుండా వాటికి నిప్పు పెడుతున్నారు. దీంతో అక్కడ దట్టమైన నల్లటి పొగ వ్యాపిస్తోంది. ఆ సమయంలో అటువైపు రాకపోకలు సాగించే వారిని ఊపిరి పీల్చుకోలేక ఇబ్బంది పడుతున్నారు. గాలులకు ఆ పొగ పక్కనున్న ఆస్పత్రి ఆవరణలోకి, చుట్టుపక్కల నివాసాల వద్దకు వ్యాపిస్తోంది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యపై జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసేందుకు వారు సిద్ధమయ్యారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం



పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఆడారి ఆనంద్‌కుమార్, ఎస్‌ఏ రెహ్మాన్

గోపాలపట్నం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పని చేయాలని వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, పార్టీ సీనియర్ నాయకుడు ఎస్‌ఏ రెహ్మాన్‌లు పిలుపునిచ్చారు. మర్రిపాలెం వుడా లేఅవుట్‌లోని పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో బుధవారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయానికి అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ నుంచి ప్రతి కార్యకర్త ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపునకు కృషి చేయాలని కోరారు. అందుకు ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రతి ఒక్క ఓటర్‌ను కలవాలని సూచించారు. ఓటర్ జాబితాలోని ఓటర్లను గుర్తించి వారు ఏ చిరునామాల్లో ఉన్నారన్నది తెలుసుకోవాలన్నారు. ప్రణాళికా బద్ధంగా ప్రతి పని చేయాలని సూచించారు. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ట్రేడ్ యూనియన్ నాయకుడు కలిదిండి బద్రీనాథ్, కార్పొరేటర్లు పి.వి.సురేష్, కొణతాల సుధ, ముర్రు వాణి, బల్ల లక్ష్మణరావు, గుండపు నాగేశ్వరరావు, పార్టీ నాయకులు, వార్డు అధ్యక్షులు బాకి శ్యామ్‌కుమార్‌రెడ్డి, గులిగిందల కృష్ణారావు, పుర్రె సురేష్, పిలకా రామ్మోహన్‌రెడ్డి, భీశెట్టి గణేష్, రేవల్ల సత్యనారాయణ, ఆడారి శ్రీనివాసరావు, సోమాదుల సురేష్, వరుపుల మహేష్, చుక్క ప్రసాదరెడ్డి, అయితంశెట్టి గోపి, అప్పల స్వామి, నమ్మి శ్రీను, దాడి సత్యనారాయణ, సాయిలత, యల్లపు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మరుగుదొడ్లకు మరమ్మతులు



బుచ్చిరాజుపాలెంలో మరుగుదొడ్లకు మరమ్మతులు చేపడుతున్న దృశ్యం



విరిగిన బేసిన్ స్థానంలో కొత్తది ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

గోపాలపట్నం: కొన్ని నెలలుగా శిథిలమైన వినియోగానికి దూరంగా ఉన్న మరుగుదొడ్లు బాగుపడుతుండడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బుచ్చిరాజుపాలెం ఏపీఎస్ఈబీ కాలనీ ప్రజా మరుగుదొడ్ల బేసిన్లు, పైప్‌లైన్లు పాడై 8 నెలలు గడుస్తోంది. అప్పటి నుంచి ఇవి నిరుపయోగంగా ఉన్నాయి. స్థానికుల ఇబ్బందులను గుర్తించిన ఈ నెల 8న 'ఈ మరుగుదొడ్లకు మోక్షం లేదా' అనే శీర్షికతో 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీంతో జీవీఎంసీ అధికారులు స్పందించి మరమ్మతు పనులు చేపట్టారు. శిథిలమైన బేసిన్లను మార్చి వాటి స్థానంలో కొత్తవి వేశారు. పైప్‌లైన్ల మరమ్మతులు చేపట్టారు. పనులు చేపట్టడంతో స్థానికులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణే లక్ష్యం



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ కార్మికులు మరియు ఉక్కు నిర్వాసితుల జీవితాలను అయోమయంలోకి నెడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేసేందుకు పావులు కదుపుతున్న కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణే లక్ష్యంగా, ప్రజల భాగస్వామ్యంతో ఉక్కు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 734వ రోజు, బుధవారం ఎం.ఎం.ఎస్.ఎం, ఎస్టీఎం విభాగాల కార్మికులు పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి దేముడు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కార్మికులు అహోరాత్రులు శ్రమించి స్టీల్‌ప్లాంట్ ఆస్తులను పెంచారని, అటువంటి పరిశ్రమను ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేయాలని అనుకోవడం దుర్మార్గమని అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రజల సంపద అని పేర్కొన్నారు. కార్మికుల హక్కులు, సదుపాయాలు కొనసాగాలంటే స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగంలోనే కొనసాగాలన్నారు. అందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డి.రమేష్, ఎం.కె.వి.రాజేశ్వరరావు, జి.ఆనంద్, టి.ఎం.మోహన్ కుమార్, వర్మ, జి.వి.రమణారావు, కె.ఆర్.కె.రాజు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

స్టీల్ ఓబీసీ నూతన కమిటీ బాధ్యతల స్వీకరణ



నూతన కమిటీకి పత్రం అందజేస్తున్న హెచ్‌ఆర్ ఉన్నతాధికారులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ బుధవారం బాధ్యతలు స్వీకరించింది. ఇటీవల జరిగిన సంఘం ఎన్నికల్లో నూతన కమిటీ గెలుపొందిన విషయం తెలిసిందే. స్టీల్‌ప్లాంట్ ఎల్‌డీసీ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎం కె. శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరు కాగా హెచ్‌ఆర్ జీఎం కె. సంజీవరావు, లైజన్ ఆఫీసర్ జి. అప్పారావు, ఎన్నికల అధికారి జె.వి. రావు విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీజీఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఓబీసీ సంఘానికి యాజమాన్యం తమ వంతు సహకారం అందిస్తుందన్నారు. నూతన కమిటీకి హెచ్‌ఆర్ ఉన్నతాధికారులు పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఓబీసీ సంఘం నూతన కమిటీ ప్రతినిధులు బి.అప్పారావు, యు. శ్రీనివాస్, కోయిలాడ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉద్యోగం సాధించడం ఒక వరం



క్యాంపస్ ఉద్యోగార్థుల తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకటరమణ

మురళీనగర్: డిప్లమో స్థాయిలో పాలిటెక్నిక్ విద్యార్థులు ఉద్యోగం సాధించడం వరమని, దీన్ని సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. బెంగళూరుకు చెందిన నెట్టూర్ టెక్నికల్ ట్రైనింగ్ ఫౌండేషన్(ఎన్‌టీటీఎఫ్) ఇటీవల నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఈ కళాశాల నుంచి 13 మంది బాలికలు ఉద్యోగాలు పొందారు. ఈ నేపథ్యంలో వీరి తల్లిదండ్రులు, కంపెనీ ప్రతినిధులతో బుధవారం ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా ఉద్యోగులకు కంపెనీలో పూర్తి రక్షణ ఉంటుందని వివరించారు. బాలికల తల్లిదండ్రులు అడిగిన పలు సందేహాలను ఎన్‌టీటీఎఫ్ ప్రతినిధులు నివృత్తి చేశారు. ఉద్యోగంలో చేరిన వారందరికీ రెండు నెలలు శిక్షణ ఇస్తామన్నారు. ఇందులో భాగంగా సాంకేతిక నైపుణ్యాలు, సాఫ్ట్ స్కిల్స్, సేఫ్టీ, సమగ్ర అభివృద్ధి వంటి అంశాల్లో శిక్షణ ఉంటుందని, అభ్యర్థులు శ్రీపెరంబదూర్‌లోని ఫస్ట్ సోలార్ కంపెనీలో పని చేయాల్సి ఉంటుందని చెప్పారు. అమెరికా, మలేసియా, వియత్నాం వంటి దేశాల్లోని ఫస్ట్ సోలార్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో కంపెనీ స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం మేనేజర్ సీపీ రమేష్ బాబు, సీనియర్ ఆఫీసర్ ఎస్.గీత, మెయింటెనెన్స్ ఇంజినీర్ బి.సాహుల్ ఇబ్రహీం, హెచ్‌ఆర్ విభాగం ప్రతినిధులు దియానా సీక్విరా, నిర్మలా దేవి, నివేదా, కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ వివిధ విభాగాల హెడ్‌లు డాక్టర్ బీవీ లక్ష్మణరావు, డాక్టర్ ఎస్.ప్రశాంతకుమారి, డి.దామోదర్, టీపీవో సీహెచ్ జయప్రకాష్‌రెడ్డి, ఏటీపీవో కుమార్ పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిత



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న బద్రీనాథ్ తదితరులు

సింధియా: యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా పట్టుదలతో కృషి చేస్తూ క్రీడల్లో రాణించినప్పుడే భవిష్యత్తు బావుటుందని వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ అన్నారు. జీవీఎంసీ 40వ వార్డు సింధియా న్యూకాలనీలోని గాంధీగ్రాం క్రీడా మైదానంలో మహాశివరాత్రి సందర్భంగా జీఆర్‌కే యూత్ ఆధ్వర్యంలో శ్రీమరిడిమాంబ వింట్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌ను బుధవారం వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్ టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించే అవకాశం ఉందన్నారు. యువత క్రీడల్లో రాణించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. ఫైనల్ మ్యాచ్‌కు పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ హాజరై విజేతలకు బహుమతులు అందిస్తారని తెలిపారు. కార్యక్రమంలో 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్, 63వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పిలక రామ్మోహనరెడ్డి, 63వ వార్డు అధ్యక్షుడు సోమాదుల సురేష్, నాయకులు వరపల మహేష్, క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు శరగడం సతీష్, హరీష్, రాజ బాబు, తేజ, సాయి, క్రీడాకారులు పాల్గొన్నారు.

సమాచారమ్ – అందుబాటులో అధికారులు

మల్కాపురం: ప్రజలు తమ సమస్యల పరిష్కారం, ఫిర్యాదుల కోసం, అవసరమైన సమాచారం తెలుసుకునేందుకు వివిధ విభాగాల అధికారులను ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు.

అధికారి పేరు	బాధ్యత	ఫోన్ నంబర్
ఆర్.జి.వి.కృష్ణ	జీవీఎంసీ జోన్–5 కమిషనర్	97050 86888
డాక్టర్ రాజేష్	అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్	99480 95520
ఏడుకొండలు	జీవీఎంసీ వర్క్స్ డీఈ	90101 15599
పచ్చియ్య	మల్కాపురం సబ్‌స్టేషన్ ఏఈ (ఏపీఈపీడీసీఎల్)	94408 12504
పద్మావతి	అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (యూసీడీ)	77299 95963
డి.వీరభద్రరావు	ములగాడ మండల తహసీల్దార్	94949 27475
లూథర్‌బాబు	మల్కాపురం లా అండ్ ఆర్డర్ సీఐ	94407 06023
భాస్కర్‌రావు	గాజువాక లా అండ్ ఆర్డర్ సీఐ	94409 04340

మహాశివరాత్రికి పకడ్బందీగా ఏర్పాట్లు

- లక్షలాదిగా వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు
- ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ ఆదేశాలు
- వివిధ శాఖల అధికారులతో సమావేశం



అప్పికొండ ఆలయ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

పెదగంట్యాడ: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అప్పికొండ సోమేశ్వర స్వామి ఆలయానికి లక్షల్లో వచ్చే భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ అధికారులను ఆదేశించారు. ఆలయ కమిటీ సభ్యులతో పాటు వివిధ శాఖల అధికారులతో ఆలయ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

- భక్తులు ఇక్కడే జాగారం చేసి, తీరంలో స్నానాలు ఆచరిస్తారు గనుక అత్యవసర వేళలో అందుబాటులో ఉండేలా గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలన్నారు.
- తాగునీరు, టాయిలెట్లు, దుస్తులు మార్చుకునే గదులను ఏర్పాటు చేయాలని సూచించారు.
- ఆలయ పరిసరాలతో పాటు తీరంలో ఎక్కడా చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచాలని జీవీఎంసీ పారిశుద్ధ్య అధికారులను ఆదేశించారు.
- దారి పొడుగునా ఉన్న విద్యుత్ స్తంభాల దీపాలు వెలిగేలా చర్యలు చేపట్టాలని ఏపీఈపీడీసీఎల్ అధికారులకు సూచించారు.
- పుణ్యస్నానాలు ఆచరించిన తర్వాత స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేయాలని, భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలని తెలియజేశారు.
- ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేలా పోలీసు అధికారులు బందోబస్తు నిర్వహించాలని చెప్పారు.

సమావేశంలో వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి, డీసీపీ ఆనందరెడ్డి, ఏసీపీ త్రినాథ్, తహసీల్దార్ రమాదేవి, ఈవో కీర్తి శ్రీనివాస్, ఆలయ కమిటీ చైర్మన్ గంగరాజు, ఆలయ అర్చకుడు చదువుల నాగరాజు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

పందుల సమస్యను పరిష్కరించండి



మల్కాపురం గెడ్డ సమీపంలో సంచరిస్తున్న పందులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం మరిడిమాంబ ఆలయానికి సమీపంలోని గెడ్డలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి కొంత మంది వ్యక్తులు పందులను ఇక్కడకు రాత్రి సమయంలో తీసుకువచ్చి విడిచిపెడుతున్నారు. ఇలా విడిచిపెట్టిన పందులు స్థానిక నివాసాల్లోకి చొరబడుతూ ఇబ్బందులు కలిగిస్తున్నాయి. అధికారులు స్పందించి పందులను ఏరివేయాలి.

– దొక్కాడ సన్యాసిరావు, మల్కాపురం